
సాక్షి గుంటూరు

శనివారం, 11, నవంబర్, 2023



బాలలకు టపాసులు

మంగళగిరి: చినకాకాని షైన్ ఆనంద ఆశ్రమం లోని బాలలకు శుక్రవారం మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ కందుకూరి గోపాలకృష్ణమూర్తి టపాసులను పంపిణీ చేశారు. మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, గంజి చిరంజీవి పాల్గొన్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 4,322 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 2300 క్యూసెక్కులు వదిలారు.

గవర్నర్‌కు దీపావళి శుభాకాంక్షలు

రైల్వేస్టేషన్: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఏ. పాటిల్ శుక్రవారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను రాజ్‌భవన్‌లో కలిసి రైల్వే శాఖ తరఫున దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



న్యూస్‌రీల్

16న తెనాలి ఎంపీపీ ఎన్నిక

తెనాలిటౌన్: తెనాలి మండల పరిషత్ అధ్యక్షుడి ఎన్నిక ఈనెల 16వ తేదీ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వి.ప్రతాప్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గత నెల 5న మండల పరిషత్ అధ్యక్షునిగా పనిచేస్తున్న చెన్ను బోయిన శ్రీనివాసరావు రాజీనామాతో ఎంపీపీ పదవి ఖాళీ ఏర్పడిందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 16వ తేదీన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు వివరించారు. మండల పరిషత్ స్పెషల్ ఆఫీసర్ వి.వనజ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపీటీసీ సభ్యులందరికి నోటీసులు అందజేశామని, సమావేశానికి ఎంపీటీసీ సభ్యులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

నేటి నుంచి తిరు నక్షత్ర మహోత్సవం



తాడేపల్లిరూరల్ : విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శనివారం నుంచి 16వ తేదీ వరకు తిరునక్షత్ర మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు.

యార్డులో 19,321 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 16,744 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 19,321 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,700 నుంచి రూ.22,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 24,100 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.15,000 నుంచి రూ.21,300 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 23,800 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 7,160 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

రెండు సబ్‌సెంటర్లకు ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్లు



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలంలోని రెండు ఆరోగ్య ఉపకేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్(ఎన్‌క్యూఏఎస్) సర్టిఫికెట్లు అందాయి. ఈ సందర్భంగా దుగ్గిరాల ప్రభుత్వ వైద్యులు డాక్టర్ అబ్దుల్ రహమాన్ సబ్ సెంటర్లలో పనిచేస్తున్న సిబ్బందిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రబృందం పరిశీలనలో దుగ్గిరాల మండలంలోని దుగ్గిరాల ఉపకేంద్రానికి 93 మార్కులు, మోరంపూడి ఉప కేంద్రానికి 91 మార్కులు వచ్చాయని, సాధారణంగా 75 మార్కులు వస్తే ఈ సర్టిఫికెట్ వస్తుందని చెప్పారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సర్కారు వైద్యశాలల్లో, ఉప కేంద్రాల్లో కల్పించిన సౌకర్యాల వల్ల ఈ ఘనత సాధ్యమైందని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఇంద్రాణి, సీహెచ్ఓ నవ్య, ఏఎన్ఎం సుజాత, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు చోరీ

పెనుమాకలో వృద్ధురాలిపై దాడి



తాడేపల్లిరూరల్: పెనుమాకలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధురాలిపై ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు దాడిచేసి ఆమె మెడలో ఉన్న బంగారపు గొలుసును లాక్కెళ్లిన ఘటన శుక్రవారం జరిగింది. తాడేపల్లి ఎస్ఐ వినోద్ కుమార్ కథనం ప్రకారం పెనుమాకకు చెందిన కళ్ళం సుబ్బాయమ్మ పిండిమరకు వెళ్లి ఇంటికి వస్తుండగా బొడ్రాయి సెంటర్ సమీపంలో గుర్తుతెలియని ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వచ్చి ఆ వృద్ధురాలి తలపై హెల్మెట్‌తో దాడి చేశారు. మెడలో ఉన్న 5 సవరల బంగారపు గొలుసును తెంచుకుని పరారయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి గాయపడిన వృద్ధురాలిని పోలీసులు ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

బహుజన బ్రహ్మరథం

మార్మోగిన జగన్నినాదం

- పోటెత్తిన అమరావతి
- అంబరాన్నంటిన ఉత్సాహం
- సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం
- ద్విచక్రవాహనాలతో యువకుల సందడి
- అడుగడుగునా నీరాజనం పలికిన ప్రజలు

అమరేశ్వరుడు త్రిశూలధారియై డమరుకనాదం మోగించినట్టు.. బాలచాముండేశ్వరి చండీదేవియై లయబద్ధంగా నర్తించినట్టు.. నందీశ్వరుడు పరవశంతో రంకెలేసినట్టు.. 'సంక్షేమం శరణం గచ్ఛామి' అంటూ బౌద్ధారామం మంత్రోచ్చారణ చేసినట్టు.. కృష్ణమ్మ జలసిరులతో హొయలొలుకుతూ జనప్రవాహమై కదంతొక్కినట్టు.. అంబరాన ఉన్న అమరావతే ఔరా అంటూ అబ్బురపడినట్టు.. ఇల అమరావతి బహుజన జయజయధ్వానాలతో దద్దరిల్లింది. సర్వజన సారథీ.. సాహో అంటూ గళమెత్తింది. నవరత్న ప్రగతి ప్రదాతకు నీరాజనం పలుకుతూ కదిలిన జగన్‌మోహన రథచక్రాలకు బ్రహ్మరథం పట్టింది. దీపావళి పర్వదిన ముంగిట 'నారా'కాసుర దండుపై సమరభేరి మోగించింది. దుష్టచతుష్టయంపై సింహగర్జన చేసింది.

సాక్షి ప్రతినిధి, గుంటూరు/అమరావతి/పెదకూరపాడు: కృష్ణా తీరం పులకించింది. అమరావతి జనసంద్రమైంది. పెదకూరపాడు నియోజకవర్గం అమరావతిలో వైఎస్సార్ సీపీ నిర్వహించిన సామాజిక సాధికార బస్ యాత్రకు అక్కడి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ధరణికోట జేబీ గార్డెన్స్ వద్ద నుంచి ప్రారంభమైన బస్ యాత్ర మూడు కిలోమీటర్ల మేర సాగింది. అమరావతిలో భారీ బహిరంగ సభ జరిగింది. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అధ్యక్షతన జరిగిన సభలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ఎంపీలు విజయసాయి రెడ్డి, లావు శ్రీకృష్ణదేవరాయలు, నందిగం సురేష్, మోపిదేవి వెంకటరమణారావు, ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, షేక్ ముస్తఫా, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే), పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా అడ్వయిజర్, సినీ నటుడు అలీ, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు పైలా సోమినాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎంతో అభివృద్ధి

నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఎన్నికల హామీలన్నీ సీఎం జగన్ నిలబెట్టుకున్నారన్నారు. మాదిపాడు- ముక్త్యాల, అమరావతి-తుళ్లూరు రోడ్డు పనులు జరుగుతున్నాయని, 35 కమ్యూనిటీ హాళ్లు వచ్చాయని, పెదకూరపాడు నియోజకవర్గంలో రూ.3,000 కోట్లతో రహదారులు మంజూరు అయ్యాయని వివరించారు.

యాత్ర సాగిందిలా..

తొలుత మండల పరిధిలోని ధరణికోట జేబీ గార్డెన్స్ వద్దకు మధ్యాహ్నం ఒంటిగంటకు బస్సు యాత్ర చేరుకుంది. వైఎస్సార్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ముఖ్యనేతలకు పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు స్వాగతం పలికారు.

- మధ్యాహ్నం 2 గంటలకు నియోజవర్గంలోని వ్యాపార, ఉద్యోగ, కుల సంఘాలు, మతపెద్దలతో నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయి సమస్యలపై చర్చించారు. వినతులు తీసుకున్నారు.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నేతలు ఎంపీలు మోపిదేవి వెంకటరమణారావు, బీద మస్తాన్ రావు, నందిగం సురేష్, శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, నియోజకవర్గ పరిశీలకుడు పైలా సోమినాయుడు విలేకరుల సమావేశం నిర్వహించారు.
- సాయంత్రం 4.30 గంటలకు నియోజవర్గంలోని అన్ని మండలాల నుంచి తరలి వచ్చిన వేలాది మంది కార్యకర్తలతో కలిసి ఎంపీ విజయసాయిరెడ్డి పాదయాత్రగా ముందుకు కదిలారు.
- హోసన్నా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు, మార్గం మధ్యలో రోడ్డుకిరువైపులా మహిళలు పూలు జల్లుతూ స్వాగతం పలికారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగింది.
- అమరావతి కచేరి సెంటర్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి మంగిశెట్టి కోటేశ్వరరావు ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఎంపీ విజయసాయిరెడ్డి తదితర నాయకులు ఆవిష్కరించారు. అనంతరం నేతలు 6.30 గంటలకు బహిరంగ సభా వేదిక వద్దకు చేరుకున్నారు.



ప్రగతి 'జ్యోతి' ప్రజ్వరిల్లే: జ్యోతి ప్రజ్వలనతో బహిరంగ సభను ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని, చిత్రంలో నంబూరు శంకరరావు, డొక్కా, పార్థసారథి, మోపిదేవి, పైలా సోమినాయుడు, నందిగం సురేష్ తదితరులు

అమరావతిని మున్సిపాలిటీ చేస్తాం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



పెదకూరపాడు,అమరావతి: అమరేశ్వర స్వామి సాక్షిగా హామీ ఇస్తున్నా అమరావతిని మున్సిపాలిటీ చేస్తామని పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకరరావు చెప్పారు. అమరావతిలోని ప్రధాన రహదారిలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు 90 శాతం పూర్తి చేసినట్లు చెప్పారు. బెల్లంకొండ – అమరావతి డబుల్ రోడ్డు, వైద్యశాలలు, గ్రామీణ రోడ్లు, అంతర్గత రోడ్ల అభివృద్ధి, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసినట్లు వివరించారు. మనబడి నాడు-నేడు కింద పాఠశాలల అభివృద్ధి, పులిచింతల వద్ద బ్రిడ్జి నిర్మాణం, సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద అటవీ శాఖ అనుమతులతో రోడ్ల అభివృద్ధి, వైకుంఠపురం వేంకటేశ్వరస్వామి ఆలయం ఘాట్ రోడ్డు, అమరావతి నుంచి తుళ్ళూరు వరకు రోడ్డు, మద్దూరు వద్ద బ్రిడ్జి, కోళ్లూరు ఆంజనేయ స్వామి ఆలయం అభివృద్ధికి స్థలం కేటాయింపు, లిఫ్ట్ ఇరిగేషన్లకు మరమ్మతులు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. అమరావతిని నిర్మిస్తామని చెబుతున్న చంద్రబాబు నాయుడు కనీసం అమరావతికి రోడ్డు వేయలేకపోయారన్నారు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారన్నారు. శంకరరావు మాట ఇస్తే శివుడు సాక్షిగా పూర్తి చేస్తాడని స్పష్టం చేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు పెదకూరపాడు, మండెపూడి, పీసపాడు, తాళ్లచెరువు లిఫ్ట్ ఇరిగేషన్లు నిర్మిస్తామన్నారు. అమరావతిలో డ్రెయినేజి సమస్యను తీరుస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయంతో పెదకూరపాడును మరింత అభివృద్ధి చేస్తామన్నారు. పెదకూరపాడు గతంలో టీడీపీ అడ్డా అని అనేక మంది అనే వారని, ఇప్పుడు ఇది వైఎస్సార్ సీపీ గడ్డగా మారిందన్నారు. తనపై పోటీ చేసేందుకే టీడీపీ వారు ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు.

సీఎం జగనన్న అందరివాడు



గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ జగన్ అన్ని కులాలు, మతాలను కలుపుకుని విప్లవాత్మక మార్పు తీసుకు వచ్చారన్నారు. పేద వారిని గొప్పోళ్లను చేయాలని చూశారన్నారు. పెదకూరపాడు అభివృద్ధికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బాగా కష్టపడుతున్నారని, నరసరావుపేట ఎంపీ కూడా అభివృద్ధిలో ముందున్నారని, గుంటూరు ఎంపీ ఎక్కడ ఉంటారో తెలియదన్నారు. ఐదేళ్లలో ఎన్నడూ చూడలేదన్నారు.

బలహీనవర్గాల అభ్యున్నతి జగన్ ఘనతే

ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

అమరావతి: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను అత్యున్నత స్థాయికి తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు చెప్పారు. శుక్రవారం సామాజిక సాధికార బస్సు యాత్ర నేపథ్యంలో ధరణికోట జేబీ గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మోపిదేవి మాట్లాడారు. గత ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాల్లో కనీసం పదిశాతం కూడా అమలు చేయలేదని, టీడీపీ అధినేత చంద్రబాబు 2014లో అలవికాని అనేక హామీలు గుప్పించి ప్రజలను మోసం చేశారని గుర్తుచేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతోందని స్పష్టం చేశారు. బలహీనవర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా 2 లక్షల 40వేల కోట్ల రూపాయల మేర లబ్ధి చేకూర్చిన సీఎం వైఎస్ జగన్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను గౌరవప్రద పదవుల్లో కూర్చోబెట్టిన మహామనిషి జగనన్న అని ప్రశంసించారు. మళ్లీ ఆయనను సీఎం చేసుకోవాల్సిన బాధ్యత బడుగు, బలహీనవర్గాలమైన మనందరిపైనా ఉందని చెప్పారు. సీఎం జగన్‌కు రోజురోజుకు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని స్పష్టం చేశారు. మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని పేర్కొన్నారు.

- బాపట్ల లోక్‌సభ సభ్యుడు నందిగం సురేష్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఐదుగురు ఎస్సీలకు మంత్రి పదవులతోపాటు ఉప ముఖ్యమంత్రి పదవిచ్చి, బీసీలకు పది మంత్రి పదవులిచ్చిన ఘనత జగనన్నదేనన్నారు.
- పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు మాట్లాడుతూ జగన్న పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో అభివృద్ధికి ఇప్పటికే 659 కోట్ల రూపాయలు, సంక్షేమానికి 1,400 కోట్ల రూపాయలు జగనన్న సహకారంతో ఖర్చు చేశామన్నారు. అమరావతి-బెల్లంకొండ డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు 149 కోట్ల రూపాయలతో శరవేగంగా జరుగుతున్నాయన్నారు. మాదిపాడు వద్ద 65 కోట్ల రూపాయలతో కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం చేస్తున్నామన్నారు.
- ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ జగనన్న పాలనలో పెదకూరపాడు అభివృద్ధి బాటపట్టిందని పేర్కొన్నారు. దీనిలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాత్ర కీలకమని పేర్కొన్నారు.



మాది సామాజిక సిల'బస్': బస్సు యాత్రలో పాల్గొన్న మోపిదేవి, నందిగం, బీద, పార్థసారథి

- వైఎస్సార్ సీపీ పెదకూరపాడు నియోజకవర్గ పరిశీలకులు పైలా సోమినాయుడు మాట్లాడుతూ జగనన్న పాలనలో సామాజిక న్యాయానికి అసలైన నిర్వచనం దొరికిందన్నారు. సమావేశంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండెపూడి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



ద్విచక్రవాహన ర్యాలీలో వైఎస్సార్ సీపీ శ్రేణుల ఉత్సాహం

సీఎం వైఎస్ జగన్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లపై కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డితో చర్చిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్

మాచర్ల: వరికపూడిసెల శంకుస్థాపన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 15న రానున్న నేపథ్యంలో మాచర్లలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) వైఎస్సార్ సీపీ యువజన విభాగం మూడు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పరిశీలించారు. ఏర్పాట్లపై చర్చించారు. అధికారులకు సూచనలు, సలహాలు అందించారు. తొలుత సాగర్ రోడ్డులోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో హెలిప్యాడ్‌ను పిన్నెల్లి సోదరులు, అధికారులు పరిశీలించారు. అక్కడి నుంచి 3.5 కిలోమీటర్ల మేర సీఎం కాన్వాయ్ పర్యటించే మార్గాన్ని పరిశీలించి బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. మాచర్ల శివారు గుంటూరు రోడ్డులోని చెన్నకేశవ స్వామి కాలనీ ఎదురు 15 ఎకరాలలో వేలాది మందితో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్టు వివరించారు.

అధికారులతో సమీక్ష

అనంతరం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై మాచర్ల మున్సిపల్ కార్యాలయంలో జిల్లా అధికారులతో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే) సమీక్షించారు. 1.27 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా రూ.1,600 కోట్లతో నిర్మించ తలపెట్టిన వరికపూడిసెల ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్ రెడ్డి పాల్గొన్నారు. పీఆర్కే మాట్లాడుతూ ఈనెల 15న ఉదయం నుంచి సాయంత్రం వరకు సీఎం పర్యటన ఉంటుందన్నారు. 30 వేల మంది నుంచి 50 వేల మంది తరలివచ్చే అవకాశం ఉందని వివరించారు. 550 బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. వసతుల కల్పనపై దృష్టిపెట్టాలని సూచించారు. సమావేశంలో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి (పీవీఆర్), జేసీ శ్యామ్‌ప్రసాద్, మెప్మా, డ్వామా యానిమేటర్లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న పీఆర్కే

అటల్ ల్యాబ్‌లలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

బాపట్ల అర్బన్: ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేకు రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం బాపట్ల జిల్లాలోని ఎడ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీరామ రూరల్ కళాశాల, చిలుమూరు పాఠశాలల్లోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను తనిఖీ చేసింది. ల్యాబ్‌ల పనితీరు, విద్యార్థుల నైపుణ్యం, ఉపాధ్యాయుల నిర్వహణ విధానాలపై రిజిస్టర్లను పరిశీలించింది. విద్యార్థులు తయారుచేసిన వివిధ నమూనాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేసింది. కార్యక్రమంలో టాస్క్ టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులు డాక్టర్ మైన హుసేన్, గుంటూరు జిల్లా వైజ్ఞానికాధికారి ఎ.రవికుమార్, బాపట్ల జిల్లా వైజ్ఞానిక అధికారి ఎండీ సాదిక్, సంబంధిత పాఠశాలల అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జిలు, ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన నమూనాలు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు

నగరాల్లో ఆహ్లాదకర పార్కులు



గాంధీ పార్కు ప్రారంభోత్సవంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపీ అయోధ్య, మేయర్ కావటి, ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరి, నగర కమిషనర్ కీర్తి చేకూరి తదితరులు

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి
- గుంటూరు నగరంలో గాంధీ పార్కు పునఃప్రారంభం

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): రాష్ట్రంలోని నగరాలన్నింటిలో ఆహ్లాదకరమైన పార్కులను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. రూ.6.25 కోట్లతో సరికొత్త హంగులతో ఆధునికీకరించిన గుంటూరు గాంధీ పార్కును శుక్రవారం ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సజ్జల రామకృష్ణారెడ్డితోపాటు ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు, నగర కమిషనర్ కీర్తి చేకూరి, తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మానసిక ఒత్తిడి, వాతావరణ కాలుష్యం నుంచి పార్కులు ఉపశమనం కలిగిస్తాయని, ప్రశాంతతను అందిస్తాయని వివరించారు. గాంధీ పార్క్ పిల్లలను ఆకర్షించేలా సరికొత్త వసతులతో రూపుదిద్దుకుందని, ఇది నగరానికి మరింత శోభ తెస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని నగరాల్లో వాకింగ్ ట్రాక్‌లు, పార్క్‌ల అభివృద్ధి చేయడం ద్వారా పర్యావరణ రక్షణ, నగర వాతావరణంలో ఆక్సిజన్ శాతాన్ని పెంచడానికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటుందన్నారు. గుంటూరు నగరం మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు ఆధ్వర్యంలో ప్రగతిబాట పట్టిందని ప్రశంసించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజిల, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ సీతారామాంజనేయులు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ సూపరింటెండెంట్ భాస్కర్, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, వెంకటకృష్ణయ్య, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే 'జగనన్నకు చెబుదాం'

- జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి
- 80 అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం


అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి

తాడికొండ: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తుందని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. శుక్రవారం తాడికొండ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆమె అందరి సమస్యలు క్షుణ్ణంగా విని పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా జేసీ రాజకుమారి మాట్లాడుతూ ప్రజల సమస్యలను మరింత వేగంగా పరిష్కరించాలన్న ఉద్దేశ్యంతో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం నిర్వహిస్తుందని, అర్జీలు ఇచ్చిన వారి సమస్యలను 7–15 రోజుల్లోగా పరిష్కరించడమే దీని ప్రధాన ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీందర్, బీసీ కార్పొరేషన్ ఈడీ దుర్గాభామి, సీపీవో శేషశ్రీ, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, ఆర్‌డబ్ల్యుస్ ఎస్ఈ సురేష్, విభిన్న ప్రతిభావంతుల ఏడీ సువార్త, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రావణ్ బాబు, పశు సంవర్ధక శాఖ జేడీ జేపీ వెంకటేశ్వర్లు, ఏపీఎంఐపీ మేనేజర్ వజ్రశ్రీ, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ లక్ష్మీ, ఎంపీడీవో అత్తోట దీప్తి, తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్ర బాబు, డెప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్, పలు విభాగాల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ఆ రోజు తర్వాత ఏం జరిగింది..


ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద పిటీషనర్లను విచారిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఐజీ పాలరాజు, వేదికపై అడిషనల్ ఎస్పీలు, ఆర్డీఓ తదితరులు

- గొట్టిపాడులో జిల్లా కలెక్టర్, ఐజీల పర్యటన
- ఘటనా ప్రాంతాల పరిశీలన
- ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయ వద్ద బహిరంగ విచారణ

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, రేంజ్ ఐజీ పాల్‌రాజు పర్యటించారు. 2018 జనవరి ఒకటో తేదీన గొట్టిపాడులో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎస్సీలకు, ఓసీలకు మధ్య గొడవలు జరగడం, మాకు న్యాయం చేయాలంటూ అనేకసార్లు దళితులు ఉద్యమాలు చేయడం తెలిసిందే. న్యాయం చేయాలని కోరుతూ ఎస్సీ కాలనీకి చెందిన అనితతో పాటు సుమారు రెండు వందల మందికి పైగా బాధితులు ఏపీ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన హైకోర్టు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు బాధితులను స్వయంగా విచారించి నివేదిక సమర్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, గుంటూరు రేంజ్ ఐజీ, పాల్‌రాజ్ విచారణ చేపట్టారు.

స్కూల్ ఉపాధ్యాయుల విచారణ

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను(గొడవ జరిగిన సమయంలో ఆ పాఠశాలలో విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు) విచారించారు. 2018లో విద్యార్థుల పట్ల సాంఘిక బహిష్కరణ జరిగిందా? విద్యార్థులను స్కూలుకు రానివ్వకపోవడం వంటివి ఘటనలు ఏమైనా జరిగాయా అన్న వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అలాంటివి ఏమీ జరగలేదని, ఆ ఘటన జరిగిన తర్వాత ఒకటి రెండు రోజులు మాత్రం గొడవ ప్రభావంతో పిల్లలు స్కూలుకి రాలేదని, తర్వాత యథావిధిగా పాఠశాలకు వచ్చారని ఉపాధ్యాయులు కలెక్టర్, ఐజీలకు వివరించారు. అనంతరం వివాదం జరిగిన ప్రదేశంతో పాటు ఎస్సీ కాలనీలోని చర్చి పరిసరాలు, రక్షిత తాగునీటి చెరువు సమీపంలోని తాగునీటి బావిని కలెక్టర్, ఐజీలు స్వయంగా పరిశీలించారు.

నిర్భయంగా నిజాలు చెప్పండి..

నిర్భయంగా నిజాలు చెప్పాలని, చెప్పలేని వారు లిఖిత పూర్వకంగా అయినా వారు ఎదుర్కొన్న సమస్యలను తెలియజేయవచ్చని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పిటిషనర్లను కోరారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విచారణ వేదిక వద్ద పిటిషనర్లతో మాట్లాడారు. గొడవ జరిగిన రోజు వారు ఎదుర్కొన్న సమస్యలను బాధిత మహిళలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వారు చెప్పిన అంశాలను అధికారులు రికార్డు చేసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ మీడియాతో మాట్లాడారు. హైకోర్టులో రిట్ పిటిషన్ నంబర్ 11093/20 అనుసరించి హైకోర్టు ఆదేశాల మేరకు గొట్టిపాడులో 2018 జనవరి ఒకటో తేదీన జరిగిన ఘటన అనంతరం జరిగిన పరిస్థితులపై బాధితులను విచారించేందుకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.

స్వల్ప ఉద్రిక్తత..

ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. బాధితుల తరఫున పోరాడుతున్న రాజా సుందరం బాబు విచారణ వేదిక వద్దకు వస్తున్న సమయంలో పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. హైకోర్టు కేవలం బాధితులను మాత్రమే విచారించాలని సూచించిందని, ఇతరులను వేదిక వద్దకు అనుమతించబోమని పోలీసులు తెలిపారు. దీంతో దళిత మహిళలు అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజసుందరం బాబు కూడా లోపలకు పంపాలని పట్టుబట్టారు. ఈ క్రమంలో కొద్దిసేపు మహిళలు పోలీసుల వైఖరిపై నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో అడిషనల్ ఎస్పీ సుప్రజ మహిళలతో మాట్లాడారు వారికి నచ్చజెప్పి శాంతింపజేశారు.

కార్యక్రమంలో గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్, అడిషనల్ ఎస్పీలు సుప్రజ, కోటేశ్వరరావు, ట్రైనీ డెప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, డీఆర్డీఏ పీడీ హరహరనాథ్, సాంఘిక సంక్షేమ శాఖ డెప్యూటీ డైరెక్టర్ మధుసూదనరావు, డ్వామా పీడీ యుగంధర్, తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీఓ శ్రీరమ్య పాల్గొన్నారు.

మచ్చుకాయల వ్యవస్థను రూపుమాపడమే లక్ష్యం

మిర్చి యార్డు చైర్మన్ రాజనారాయణ


మాట్లాడుతున్న నిమ్మకాయల రాజనారాయణ, ప్రభుదాసు, అన్నపూర్ణ.

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో మచ్చుకాయల వ్యవస్థను నాశనం చేసి, రైతులకు అన్యాయం జరగకుండా చూడటమే పాలకవర్గం ప్రధాన లక్ష్యమని మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ స్పష్టం చేశారు. మిర్చి యార్డు ఆవరణలోని ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మిర్చి యార్డులో అనాదిగా మచ్చుకాయల పేరిట జరుగుతున్న దోపిడీని అరికట్టేందుకు పాలకవర్గం పగ్గాలు చేపట్టాక కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందన్నారు. యార్డు పరిసర ప్రాంతాల్లో ఉన్న మచ్చు కాయల దుకాణాలను మూసి వేయించడం జరిగిందని చెప్పారు. భద్రతా సిబ్బందిని కాపలా పెట్టి నమూనా కోసం కేజీలకు కేజీలు మచ్చుకాయలు తీసుకువెళ్ళే గుమస్తాలు, హమాలీలను నిలువరించామన్నారు. ఎవరైనా మచ్చుకాయలు తీసుకెళ్తున్నా స్వాధీనం చేసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే రెండు విడతలుగా స్వాధీనం చేసుకున్న మచ్చు కాయలు ఆక్షన్ వేసి మార్కెట్ యార్డుకు రూ.1.50 లక్షలు మార్కెట్ యార్డుకు జమ చేయడం జరిగిందని గుర్తు చేశారు. మరో 54 బస్తాలు స్వాధీనం చేస్తున్న మచ్చుకాయలు సుమారు 2,430 కిలోలు ఉన్నాయని, వాటికి త్వరలో ఆక్షన్ వేయడం జరుగుతుందని చెప్పారు. సమావేశంలో యార్డు పాలకవర్గ సభ్యులు జి.ప్రభుదాసు, కోలా అన్నపూర్ణ పాల్గొన్నారు.

యార్డుకు మూడు రోజులు సెలవులు...

దీపావళి పండుగ సందర్భంగా గుంటూరు మార్కెట్ యార్డుకు వరుసగా మూడు రోజుల పాటు సెలవులు వచ్చాయి. శని, ఆదివారాలు వారంతపు సెలవులతో పాటు సోమవారం దీపావళి పండుగ సెలవుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 14వ తేదీ మంగళవారం నుంచి యార్డులో క్రయ విక్రయాలు కొనసాగుతాయని యార్డు చైర్మన్ రాజనారాయణ తెలిపారు.

14న మిర్చి యార్డులో ప్రత్యేక సమావేశం

గుంటూరు మార్కెట్ యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు మిర్చి యార్డుకు సంబంధించి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరగనుందని యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిర్చి సీజన్ సమీపిస్తున్నందున మిర్చి క్రయ విక్రయాలు సజావుగా కొనసాగేందుకు, యార్డులో సీసీ కెమెరాల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ, శాంపిల్స్, మచ్చు కాయల విషయం, యార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులు తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు వెల్లడించారు. సమావేశానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ సంయుక్త సంచాలకులు కాకుమాను శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు బి.రాజబాబు, పాలకవర్గ సభ్యులతో పాటు మిర్చి ఎక్స్‌పోర్టర్స్, కమీషన్ ఏజంట్స్, ఎగుమతి వ్యాపారుల అసోసియేషన్స్, అన్ని ముఠా కార్మికుల అసోసియేషన్ నాయకులను ఆహ్వానించడం జరిగిందని ఆయన వివరించారు.

దేశీయ వైద్య సంఘ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): ఆంధ్రప్రదేశ్ దేశీయ వైద్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. శుక్రవారం అరండల్‌పేటలో సంఘ ఆధ్వర్యంలో ధన్వంతరీ జయంతి వేడుకలను నిర్వహించడంతో పాటు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ ఉపాధ్యక్షుడిగా జి.హనుమంతరావు, కార్యదర్శిగా హరిబాబు, ట్రెజరర్‌గా హనుమంతరావు, కార్యవర్గ సభ్యులుగా రామారావు, కోటేశ్వరరావులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ శతాబ్దాల చరిత్ర కలిగిన ఆయుర్వేదం ప్రాముఖ్యతను, పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు తగిన కృషి చేస్తామన్నారు.

ధర్మ శాస్త్రాలు కుల, మతాలకు అతీతం


ప్రసంగిస్తున్న సహస్రావధాని గరికపాటి

గుంటూరు ఎడ్యుకేషన్: ధర్మ శాస్త్రాలు కుల, మతాలకు అతీతమని మహా సహస్రావధాని, వ్యక్తిత్వ వికాస ప్రసంగీకుడు డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. శుక్రవారం జేసీ లా కళాశాలలోని విద్యార్థులకు ''నాటి ధర్మ శాస్త్రాలు–నేటి ప్రాధాన్యం'' అనే అంశంపై ఉపన్యాసమిచ్చారు. ఆయన మాట్లాడుతూ పంచభూతాలు కలుషితానికి మానవుల మనస్సే కారణమని చెప్పారు. యువత దేశానికి చక్కని ఆస్తి అని, వారు క్షణికావేశానికి గురి కావద్దని సూచించారు. న్యాయ విద్యార్థులు ప్రతి విషయాన్ని సూక్ష్మంగా గ్రహించడం వలన న్యాయవాదులుగా రాణించగలరని చెప్పారు. దైవభక్తి కంటే దేశభక్తి ముఖ్యమని ఉద్బోధించారు. ఆత్మ విశ్వాసం, మనోస్థైర్యాన్ని నేర్పని చదువు వ్యర్థమని, సరైన న్యాయవ్యవస్థ, రక్షక వ్యవస్థ వలనే ప్రాచీన కాలంలో రాజ్యాలు అభివృద్ధి చెందాయని వివరించారు. ధర్మం కోసం వ్యూహాలు పన్నాలని న్యాయవాదులకు సూచించారు. దేవాలయాలపై అధికారం వంశపారం పర్యంగా ఉండాలని, ఉపాధి కల్పన ప్రభుత్వాల బాధ్యత కాదన్నారు. వివిధ వృత్తులకు రక్షణ కల్పించడం ద్వారా ఆనాడు ప్రజలు చక్కగా జీవించారని, ధర్మశాస్త్రాలు మహిళలకు రక్షణ కల్పించాలని అన్నారు. గరికపాటి ప్రసంగం ఆద్యంతం విద్యార్థులు లీనమై ఆలకించారు. అనంతరం గరికపాటి నరసింహారావును కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ కె.కృష్ణప్రసాద్, కార్యదర్శి వేమన కుప్పుస్వామి, పాలకవర్గ సభ్యులు కె. రామారావు, పి. గోపీచంద్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుధాకరబాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు 'కంతేరు' ప్రాజెక్టు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు

కంతేరు(తాడికొండ): రాష్ట్ర స్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు తాడికొండ మండలం కంతేరు గ్రామానికి చెందిన జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం టి.పద్మావతి తెలిపారు. జిల్లాస్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రాజెక్టుల సందర్శన గుంటూరులోని డీసీఈబీ హాలులో ఈ నెల 9వ తేదీ నిర్వహించిన ప్రదర్శనకు జిల్లా వ్యాప్తంగా వంద ప్రాజెక్టులు నమోదు కాగా అందులో 84 ప్రాజెక్టులు ప్రదర్శించినట్లు చెప్పారు. అందులో ఏడు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయగా ఎంపికైన ప్రాజెక్టులలో మా స్కూల్‌కు అవకాశం దక్కడం గర్వకారణంగా పేర్కొన్నారు. 9వ తరగతి చదువుతున్న విద్యార్థి మారెళ్ల శ్రీకాంత్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు ఎం.ధనయ్య గైడ్ టీచర్ ఆధ్వర్యంలో తాగునీటిలో ఫ్లోరైడ్ శాతం తగ్గించడం ద్వారా మానవునిలో దంతాలు, ఎముకలు క్షీణిత నివారణపై విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు అందరినీ ఆకట్టుకొని రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థి మారెళ్ళ శ్రీకాంత్, ఉపాధ్యాయుడు ఎం.ధనయ్యను హెచ్ఎం పద్మావతి అభినందించారు.



సౌత్‌జోన్ జట్టులో త్రిష

సీనియర్ మహిళల ఇంటర్ జోనల్ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే సౌత్‌జోన్ జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో హైదరాబాద్ నుంచి గొంగడి త్రిష, భోగి శ్రావణి... ఆంధ్ర నుంచి బారెడ్డి అనూష, ఎస్.అనూష, నీరగట్టు అనూష ఎంపికయ్యారు. ఈ టోర్నీ ఈనెల 24 నుంచి డిసెంబర్ 4 వరకు లక్నోలో జరుగుతుంది. హైదరాబాద్‌కు చెందిన 17 ఏళ్ల త్రిష ఈ ఏడాది అండర్-19 మహిళల ప్రపంచకప్ సాధించిన భారత జట్టులో సభ్యురాలిగా ఉంది.



సెమీఫైనల్లో సుమిత్

హెల్సింకి ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. ప్రపంచ 69వ ర్యాంకర్ ఎమిల్ రుసువోరి (ఫిన్‌లాండ్)తో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 169వ ర్యాంకర్ సుమిత్ తొలి సెట్‌ను 6-3తో గెలిచి, రెండో సెట్‌లో 3-1తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఈ దశలో ఎమిల్ గాయం కారణంగా వైదొలగడంతో సుమిత్‌ను విజేతగా ప్రకటించారు. నేడు జరిగే సెమీఫైనల్లో ఇటలీ ప్లేయర్ స్టెఫానో ట్రావాగ్లియాతో సుమిత్ ఆడతాడు.

ఇరుగు దిష్టి... పొరుగు దిష్టి...

రచిన్‌కు దిష్టి తీసిన అమ్మమ్మ



సాక్షి, బెంగళూరు: వన్డే ప్రపంచకప్‌లో సంచలన ప్రదర్శన కనబరుస్తున్న న్యూజిలాండ్ క్రికెటర్ రచిన్ రవీంద్ర భారత సంతతికి చెందిన వాడని తెలిసిందే. రచిన్ కన్నడిగుడు. ఇప్పటికీ అతని మూలాలు బెంగళూరుతో ముడిపడే ఉన్నాయి. అందుకే శ్రీలంకతో మ్యాచ్ ముగియగానే రచిన్ అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. తన మనవడు పుట్టింది విదేశంలో అయినా స్వదేశీ అలవాట్లు, సంప్రదాయాలు బాగా తెలిసిన పెద్దావిడ (అమ్మమ్మ) తన ఇంటికి రాగానే రచిన్‌ను సోఫాలో కూర్చోబెట్టి దిష్టి తీసింది. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరలవుతోంది. కివీస్‌లో స్థిరపడిన రచిన్ తల్లిదండ్రులు దీప, రవి కృష్ణమూర్తి బెంగళూరు వాసులు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన రవి వృత్తిరీత్యా 1990లో కివీస్‌కు వలస వెళ్లగా... 1999లో వెల్లింగ్టన్‌లో రచిన్ జన్మించాడు. రవి కృష్ణమూర్తికి క్రికెట్ అంటే ఇష్టం. భారత దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్‌లంటే అభిమానం. అందువల్లే తన కుమారుడికి వారిద్దరి పేర్లు కలిపి పెట్టారు. తనకిష్టమైన క్రికెట్‌లో బ్యాటర్‌ను చేశాడు.

రచిన్‌కు ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు



దుబాయ్: రచిన్ రవీంద్ర ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డుకు ఎంపికయ్యాడు. ప్రస్తుత వరల్డ్‌కప్‌లో రచిన్ అత్యధిక పరుగులు (565) చేసిన రెండో బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. లీగ్ దశలో మొత్తం 9 మ్యాచ్‌లాడిన ఈ కివీస్ ఓపెనర్ 3 శతకాలు, 2 అర్ధసెంచరీలు సాధించాడు. న్యూజిలాండ్ సెమీస్ చేరడంలో కీలక భూమిక పోషించాడు. ఈ నిలకడైన ప్రదర్శనే అతనికి ఐసీసీ అవార్డుకు ఎంపిక చేసింది. రేసులో ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన దక్షిణాఫ్రికా ఓపెనర్ డికాక్ (591), భారత సీమర్ బుమ్రా (15 వికెట్లు) ఉన్నప్పటికీ అవార్డు మాత్రం రచిన్‌నే వరించింది. 2021 జనవరి నుంచి ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు ఇస్తోంది. రచిన్‌కంటే ముందు న్యూజిలాండ్ నుంచి డెవాన్ కాన్వే (2021-జూన్), ఎజాజ్ పటేల్ (2021-డిసెంబర్) ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులు గెల్చుకున్నారు.

శ్రీలంక క్రికెట్ బోర్డు సస్పెండ్

ఐసీసీ నిర్ణయం

దుబాయ్: శ్రీలంక క్రికెట్ బోర్డు వ్యవహారాల్లో ప్రభుత్వ జోక్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) కఠిన నిర్ణయం తీసుకుంది. శ్రీలంక క్రికెట్ బోర్డు సభ్యత్వాన్ని సస్పెండ్ చేస్తున్నట్లు... ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని శుక్రవారం ఐసీసీ ప్రకటించింది. ఈనెల 21న ఐసీసీ బోర్డు సమావేశం జరుగుతుందని, ఆ తర్వాతే శ్రీలంక బోర్డు భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత వస్తుందని ఐసీసీ తెలిపింది. భారత్‌లో జరుగుతున్న వన్డే ప్రపంచకప్‌లో శ్రీలంక నిరాశాజనక ప్రదర్శన చేసింది. ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లో కేవలం రెండింటిలో మాత్రమే గెలిచింది. దాంతో శ్రీలంక జట్టు ఆటతీరుపై ఆ దేశ ప్రభుత్వ క్రీడా మంత్రి రోషన్ రణసింఘే ఆగ్రహం వ్యక్తం చేస్తూ శ్రీలంక క్రికెట్ బోర్డును రద్దు చేశారు. మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కూడిన తాత్కాలిక కమిటీని నియమించారు. అయితే ఈ నిర్ణయంపై బోర్డు కోర్టుకు వెళ్లింది. ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కోర్టు క్రికెట్ బోర్డును పునర్నియమించింది. జింబాబ్వే (2021) తర్వాత ఐసీసీ ద్వారా సస్పెన్షన్‌కు గురైన రెండో పూర్తిస్థాయి సభ్యత్వ దేశం శ్రీలంక కావడం గమనార్హం.

దర్జాగా దక్షిణాఫ్రికా గెలుపు

- ఐదు వికెట్ల తేడాతో సఫారీ విక్టరీ
- రాణించిన కొయెట్జీ, డసెన్
- ప్రపంచకప్‌ను ఓటమితో ముగించిన అఫ్గానిస్తాన్
- అజ్మతుల్లా పోరాటం వృథా



డసెన్

అహ్మదాబాద్: ఈ వన్డే వరల్డ్‌కప్‌లో అందరినీ ఆకట్టుకున్న అఫ్గానిస్తాన్ పోరాటం చివరకు పరాజయంతో ముగిసింది. ఇది వరకే సెమీఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా ఆఖరి లీగ్ మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌పై ఐదు వికెట్ల తేడాతో గెలిచి ఈనెల 16న కోల్‌కతాలో ఆస్ట్రేలియాతో జరిగే రెండో సెమీఫైనల్ పోరులో పూర్తి విశ్వాసంతో బరిలోకి దిగనుంది. నిర్ణీత తొమ్మిది లీగ్ మ్యాచ్‌లను పూర్తి చేసుకున్న దక్షిణాఫ్రికా ఏడో విజయంతో 14 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. అసాధ్యమైన సమీకరణంతో సెమీఫైనల్ ఆశలు వదులుకున్న అఫ్గానిస్తాన్ ఈ మెగా ఈవెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌తోపాటు మాజీ విశ్వవిజేతలు పాకిస్తాన్, శ్రీలంకలను ఓడించామన్న సంతృప్తితో స్వదేశానికి వెళ్లనుంది. నరేంద్ర మోదీ స్టేడియంలో శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్తాన్ 50 ఓవర్లలో 244 పరుగుల వద్ద ఆలౌటైంది. అజ్మతుల్లా ఒమర్జాయ్ (107 బంతుల్లో 97 నాటౌట్; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేసి సెంచరీకి మూడు పరుగుల దూరంలో నిలిచాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో గెరాల్డ్ కొయెట్జీ 4, ఎన్‌గిడి, కేశవ్ మహరాజ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం సునాయాస లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 47.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 247 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వాన్‌డర్ డసెన్ (95 బంతుల్లో 76 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచి గెలిపించాడు. అఫ్గాన్ బౌలర్లలో రషీద్ ఖాన్, మొహమ్మద్ నబీ చెరో 2 వికెట్లు తీశారు.

ఒమర్జాయ్ ఒంటరిగా...

ఓపెనర్లు ఇబ్రహీమ్ జద్రాన్ (15), రహ్మనుల్లా గుర్బాజ్ (22 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్) పెద్దగా రాణించలేదు. కెప్టెన్ హష్మతుల్లా (2) కూడా నిరాశపరచడంతో 45 పరుగులకే 3 వికెట్లను కోల్పోయిన అఫ్గాన్‌ను మిడిలార్డర్ బ్యాటర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ ఆదుకున్నాడు. 71 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అవతలివైపు రహ్మత్ షా (46 బంతుల్లో 26; 2 ఫోర్లు), ఇక్రామ్ (12), రషీద్ ఖాన్ (14), నూర్ అహ్మద్ (32 బంతుల్లో 26; 4 ఫోర్లు) ఇలా ఏ ఒక్కరు బాధ్యతగా క్రీజులో నిలువలేకపోయినా... అజ్మతుల్లా మాత్రం కడదాకా నిలబడి ఒంటరి పోరాటం చేశాడు. శతకానికి 3 పరుగుల దూరంలో అజేయంగా నిలిచాడు. అతని పోరాటం వల్లే అఫ్గాన్ ఆ మాత్రం స్కోరు చేసింది.



ఒమర్జాయ్

స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) క్లాసెన్ (బి) కేశవ్ 25; జద్రాన్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 15; రహ్మత్ షా (సి) మిల్లర్ (బి) ఎన్‌గిడి 26; హష్మతుల్లా (సి) డికాక్ (బి) కేశవ్ 2; అజ్మతుల్లా ఒమర్జాయ్ (నాటౌట్) 97; ఇక్రామ్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 12; నబీ (సి) డికాక్ (బి) ఎన్‌గిడి 2; రషీద్ ఖాన్ (సి) డికాక్ (బి) ఫెలుక్‌వాయో 14; నూర్ అహ్మద్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 26; ముజీబ్ (సి) మార్క్‌రమ్ (బి) కొయెట్జీ 8; నవీనుల్ (రనౌట్) 2; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (50 ఓవర్లలో ఆలౌట్) 244. వికెట్ల పతనం:** 1-41, 2-41, 3-45, 4-94, 5-112, 6-116, 7-160, 8-204, 9-226, 10-244. **బౌలింగ్:** రబడ 10-0-40-0, ఎన్‌గిడి 8.3-0-69-2, మార్క్‌రమ్ 4.3-0-25-0, కొయెట్జీ 10-1-44-4, కేశవ్ మహరాజ్ 10-1-25-2, ఫెలుక్‌వాయో 7-0-36-1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నబీ 41; బవుమా (సి) గుర్బాజ్ (బి) ముజీబ్ 23; డసెన్ (నాటౌట్) 76; మార్క్‌రమ్ (సి) నవీనుల్ (బి) రషీద్ 25; క్లాసెన్ (బి) రషీద్ ఖాన్ 10; మిల్లర్ (సి అండ్ బి) నబీ 24; ఫెలుక్‌వాయో (నాటౌట్) 39; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (47.3 ఓవర్లలో 5 వికెట్లకు) 247. వికెట్ల పతనం:** 1-64, 2-66, 3-116, 4-139, 5-182. **బౌలింగ్:** ముజీబ్ 10-0-51-1, నవీనుల్ 6.3-0-52-0, నబీ 10-1-35-2, ఒమర్జాయ్ 1-0-8-0, రషీద్ ఖాన్ 10-1-37-2, నూర్ అహ్మద్ 9-0-49-0, రహ్మత్ షా 1-0-12-0.

ఆదుకున్న డసెన్

సునాయాస లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓపెనర్లు డికాక్ (47 బంతుల్లో 41; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ బవుమా (28 బంతుల్లో 23; 3 ఫోర్లు) తొలి వికెట్‌కు 64 పరుగులు జోడించి మంచి ఆరంభమే ఇచ్చారు. అయితే మార్క్‌రమ్ (32 బంతుల్లో 25; 1 ఫోర్, 1 సిక్స్), క్లాసెన్ (10) లాంటి కీలక బ్యాటర్లు విఫలమవడంతో 139 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన డసెన్... మిల్లర్ (33 బంతుల్లో 24; 1 ఫోర్, 1 సిక్స్)తో కలిసి పరిస్థితి చక్కదిద్దాడు. తర్వాత ఫెలుక్‌వాయో (37 బంతుల్లో 39 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్సర్లు) ధాటిగా ఆడటంతో దక్షిణాఫ్రికా సంచలనానికి తావివ్వకుండా గెలిచింది. అబేధ్యమైన ఆరో వికెట్‌కు డసెన్, ఫెలుక్‌వాయో 65 పరుగులు జోడించారు.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	9	7	2	14	1.261
ఆస్ట్రేలియా	8	6	2	12	0.861
న్యూజిలాండ్	9	5	4	10	0.743
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	9	4	5	8	-0.336
ఇంగ్లండ్	8	2	6	4	-0.885
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	9	2	7	4	-1.419
నెదర్లాండ్స్	8	2	6	4	-1.635

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే.-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా × బంగ్లాదేశ్
వేదిక: పుణే
ఉదయం గం. 10:30 నుంచి

ఇంగ్లండ్ × పాకిస్తాన్
వేదిక: కోల్‌కతా
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

రన్నరప్ నైశిక్ రెడ్డి జోడీ



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య జూనియర్ సర్క్యూట్ టోర్నీలో తెలంగాణకు చెందిన గనగామ నైశిక్ రెడ్డి రన్నరప్‌గా నిలిచాడు. ఢాకాలో జరిగిన ఈ టోర్నీలో నైశిక్ రెడ్డి-ప్రబీర్ ముకేశ్ చావ్లా (భారత్) ద్వయం బాలుర డబుల్స్ విభాగం ఫైనల్లో ఓటమి చవిచూసింది. తుది పోరులో నైశిక్-ప్రబీర్ జోడీ 2-6, 3-6తో భారత్‌కే చెందిన తవీశ్ పాహ్వా-అర్ణవ్ యాదవ్ జంట చేతిలో ఓటమి పాలైంది.


సెమీస్‌లో అభయ్ నిష్క్రమణ



న్యూఢిల్లీ: నియోస్ వెనిస్ వెర్డె ఓపెన్ స్క్వాష్ టోర్నీలో భారత ప్లేయర్ అభయ్ సింగ్ సెమీఫైనల్లో నిష్క్రమించాడు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారం రెండో సీడ్ రోరీ స్టీవర్ట్ (స్కాట్లాండ్)తో జరగాల్సిన సెమీఫైనల్లో అభయ్ గాయం కారణంగా బరిలోకి దిగకుండా తన ప్రత్యర్థికి వాకోవర్ ఇచ్చాడు. క్వార్టర్ ఫైనల్లో అభయ్ 11-1, 7-11, 19-17, 8-11, 11-6తో ఆరో సీడ్ విక్టర్ బైర్టస్ (చెక్ రిపబ్లిక్)పై గెలిచాడు.

సినిమా

సూపర్ స్టార్ కృష్ణ విగ్రహావిష్కరణ



● బెల్లం దుర్గ, దేవినేని అవినాష్, ఘట్టమనేని బాబీ, కమల్‌హాసన్

సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహాన్ని ప్రముఖ నటుడు కమల్‌హాసన్ ఆవిష్కరించారు. విజయవాడలోని గురునానక్ కాలనీ కేడీజీఓ పార్కులో కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 'భారతీయుడు 2' చిత్రం షూటింగ్ కోసం విజయవాడలో ఉన్న కమల్‌హాసన్.. కృష్ణ-మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఆహ్వానం మేరకు కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది'' అన్నారు కమల్‌హాసన్. ఈ విగ్రహావిష్కరణలో పాల్గొన్న విజయవాడ తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ మాట్లాడుతూ– ''కళామతల్లికి తనదైన శైలిలో సేవలందించి, ప్రేక్షకుల మనసులో సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకున్నారు కృష్ణగారు. తండ్రి గౌరవాన్ని మహేశ్‌బాబుగారు నిలబెడుతున్నారు'' అన్నారు. ''కృష్ణగారి విగ్రహావిష్కరణ కేవలం పదిరోజుల వ్యవధిలో పూర్తి చేసేందుకు సహకరించిన సీఎం జగన్ మోహన్ రెడ్డిగారికి కృతజ్ఞతలు'' అని కృష్ణ అభిమానుల సంఘం పేర్కొంది. ఈ కార్యక్రమంలో విజయవాడ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కృష్ణ కుటుంబ సభ్యుడు ఘట్టమనేని బాబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు గల్లా పద్మావతి, రాజ్‌కమల్ పాల్గొన్నారు.

గర్వంగా ఉంది: హీరో మహేశ్‌బాబు

''నాన్నగారి విగ్రహాన్ని ఆవిష్కరించిన కమల్ హాసన్‌గారికి కృతజ్ఞతలు. నాన్నగారు వదిలి వెళ్లిన జ్ఞాపకాలు, వారసత్వానికి ఇదొక నివాళి. నాన్న విగ్రహం ఏర్పాటుకు కారణమైన అందరికీ, ఈ వేడుక ఘనంగా నిర్వహించిన అభిమానులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు'' అంటూ ట్వీట్ చేశారు మహేశ్ బాబు.

ఇళయరాజా బయోపిక్‌లో ధనుష్



● ధనుష్, ఇళయరాజా

సంగీత జ్ఞాని ఇళయరాజా జీవితం వెండితెరపైకి రానుంది. ఇందులో ధనుష్ ఓ ప్రధాన పాత్రలో నటించనున్నారు. మెర్క్యురీ గ్రూప్, కనెక్ట్ మీడియా సంస్థలు ఈ బయోపిక్‌ను నిర్మించనున్నాయి. వచ్చే ఏడాది అక్టోబరులో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభించి, 2025 ఏడాది మధ్యలో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా మెర్క్యురీ గ్రూప్ సీఈవో, ఎండీ శ్రీరామ్ భక్తి శరణ్ మాట్లాడుతూ –''ప్రాంతీయ కథలతో సినిమాలు తీస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. అందుకే లోకల్, ప్రాంతీయ కథలను అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కించాలనుకుంటున్నాం'' అన్నారు. ''రాబోయే రెండు దశాబ్దాల్లో భారతీయ వినోద పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రపంచ వినోద పరిశ్రమలో ప్రసిద్ధి చెందిన మెర్క్యురి సంస్థతో మెగా బడ్జెట్ సినిమాలను నిర్మించడానికి వారితో చేతులు కలపడం మాకు సంతోషంగా ఉంది'' అని కనెక్ట్ మీడియా ప్రతినిధి వరుణ్ మాథుర్ అన్నారు.



● కాజల్

వేటాడే సత్యభామ

'సత్యా.. ఈ కేసు నీ చేతుల్లో లేదు (ప్రకాశ్‌రాజ్).. కానీ ఆ ప్రాణం నా చేతుల్లోనే పోయింది సార్ (కాజల్ అగర్వాల్)' అనే డైలాగ్స్‌తో మొదలవుతుంది 'సత్యభామ' టీజర్. పోలీసాఫీసర్ సత్యభామ పాత్రలో కాజల్ అగర్వాల్ నటిస్తున్న చిత్రం ఇది. ప్రకాశ్‌రాజ్, నవీన్ చంద్ర కీలక పాత్రధారులు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపెల్లి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకులుగా వ్యవహరిస్తూ స్క్రీన్‌ప్లే అందించారు. శుక్రవారం 'సత్యభామ' టీజర్‌ను రిలీజ్ చేశారు. 'సార్.. ఆ గిల్ట్ నన్ను వెంటాడుతూనే ఉంది. వేటాడాలి (కాజల్ అగర్వాల్)', 'ఆ అమ్మాయి చావుకు మీరే కారణం అంటున్నారు. ఈ కేసును మీరు వదిలేసినట్లేనా? (విలేకర్లు).. నెవర్ (కాజల్)' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల.

కొత్తవాళ్లతో సినిమా పెద్ద బాధ్యత - నిహారిక



● యూనిట్‌కి స్క్రిప్ట్ అందిస్తున్న అల్లు అరవింద్

''మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌లో ఇప్పటివరకు వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిలిం‌స్ చేశాం. తొలిసారి ఫీచర్ ఫిల్మ్ ప్రారంభించాం. ఇంతమంది కొత్తవాళ్లతో సినిమా చేయటం పెద్ద బాధ్యతగా భావిస్తున్నాను'' అన్నారు నిహారిక కొణిదెల. యదు వంశీ దర్శకత్వంలో నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్ఎల్‌పీ, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్‌పై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మిస్తున్న చిత్రం శుక్రవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నటుడు నాగబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో వరుణ్ తేజ్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ వెంకీ కుడుముల గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాత అల్లు అరవింద్ స్క్రిప్ట్‌ని యూనిట్‌కి అందించారు. యదు వంశీ మాట్లాడుతూ– ''ఈ సినిమా ద్వారా 11 మందిని హీరోలుగా, నలుగురిని హీరోయిన్లుగా పరిచయం చేస్తున్నాం'' అన్నారు. ''ఈ చిత్రంతో నేను, నా సతీమణి జయలక్ష్మి నిర్మాతలుగా పరిచయమవుతున్నాం'' అన్నారు శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ అధినేత ఫణి. ఈ చిత్రానికి కెమెరా: రాజు ఎదురోలు, సంగీతం: అనుదీప్ దేవ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్.

లింగి లింగిడి..!



● రాహుల్, శివానీ, మిథున్, తేజా మార్ని, 'బన్నీ' వాసు, విద్య

శ్రీకాంత్ మేక, రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల అవుతోంది. రంజిన్ రాజ్, మిథున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగిడి..' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేయగా, 30 మిలియన్ వ్యూస్‌ను పూర్తి చేసుకుంది. ''ఈ పాటలానే మా చిత్రానికి ప్రేక్షకులు విజయం అందిస్తారనే నమ్మకం ఉంది'' అని హైదరాబాద్‌లో నిర్వహించిన సెలబ్రేషన్స్‌లో 'బన్నీ' వాసు అన్నారు.



● జాన్వీ కపూర్

రెండు హృదయాల కల

'రూహి' చిత్రం తర్వాత రాజ్ కుమార్ రావు, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. 'నో డ్రీమ్ ఈజ్ ఎవర్ చేజ్‌డ్ ఎలోన్!' అనేది క్యాప్షన్. క్రికెట్ నేపథ్యంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ డ్రామా ఫిల్మ్‌కు శరణ్‌శర్మ దర్శకత్వం వహించగా, కరణ్ జోహార్ నిర్మించారు. ''ఒకే కల కోసం రెండు హృదయాలు ఎదురు చుస్తున్నాయి'' అంటూ ఈ మూవీని ఏప్రిల్ 19న రిలీజ్ చేయనున్నట్లుగా జాన్వీ కపూర్ అండ్ టీమ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

మాస్ రింగు...



● సోహైల్

'బిగ్ బాస్' ఫేమ్ సోహైల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. శ్రీ కోనేటి దర్శకత్వంలో గ్లోబల్ ఫిలిమ్స్– కథ వేరుంటాది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మిస్తున్నారు. మేఘా లేఖ, సునీల్, సిరి హన్మంత్, ఇంద్రజ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'రింగు రింగు బిళ్ల..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకి దేవ్ పవార్ సాహిత్యం అందించగా, భోలే షావలి, రఘు రామ్ పాడారు. ప్రేమ్ రక్షిత్ మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ''ఫుల్ మాస్‌గా 'రింగు రింగు బిళ్ల..' సాంగ్ ఉంటుంది. సోహైల్ చేసిన మాస్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అన్నారు మేకర్స్.

సరికొత్త ట్రయల్



● 'ది ట్రయల్' పోస్టర్

స్పందన పల్లి, యుగ్ రామ్, వంశీ కోటు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది ట్రయల్'. స్మృతీ సాగి, శ్రీనివాస నాయుడు కిల్లాడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ''ఇప్పటివరకు తెలుగు తెరపై చూడని కంప్లీట్ ఇంటరాగేటివ్ కథతో, సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌తో ఈ సినిమా కథనం ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, సహనిర్మాత: సుదర్శన్ రెడ్డి.

ప్రేమలో గీతాశంకరం



● ప్రియాంక, ముఖేష్ గౌడ

ముఖేష్ గౌడ, ప్రియాంకా శర్మ జంటగా కె.దేవానంద్ నిర్మిస్తున్న ప్రేమకథా చిత్రం 'గీతా శంకరం'. దీపావళి సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ముఖేష్ గౌడ మాట్లాడుతూ– ''సీరియల్స్‌లో పేరు సంపాదించుకున్నట్లే ఈ సినిమాతో వెండితెరపై కూడా మంచి పేరు తెచ్చుకుంటాననే నమ్మకం ఉంది'' అన్నారు. ''నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్ర లభించడం నా లక్‌గా భావిస్తున్నా'' అన్నారు ప్రియాంకా శర్మ. ''ఇరవై కథలు విన్నాం. కానీ రుద్ర చెప్పిన ఈ కథ నచ్చడంతో ఈ సినిమా చేస్తున్నాం. ఈ నెల 14న కొత్త షెడ్యూల్ ఆరంభిస్తాం'' అన్నారు దేవానంద్. ''ప్రేక్షకులకు నచ్చే అంశాలన్నీ ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు రుద్ర. ఈ చిత్రానికి సంగీతం: అబు, కెమెరా: ఉదయ్ ఆకుల.

మంచి సినిమా అంటున్నారు - నిర్మాత సాయి సుధాకర్



''అలా నిన్ను చేరి' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రేక్షకుల నుంచి ఎక్కువగా స్పందన వస్తోంది. వారంతా ఫస్ట్ హాఫ్‌కి ఎక్కువగా కనెక్ట్ అవుతున్నారు'' అని కొమ్మాలపాటి సాయి సుధాకర్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. మారేష్ శివన్ దర్శకత్వం వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి సాయి సుధాకర్ మాట్లాడుతూ–''మా సినిమా చూసిన చాలామంది తమ జీవితాన్ని చూసుకున్నట్టుగా ఉందనడం సంతోషం. 'అలా నిన్ను చేరి' నిర్మాతగా మొదటి సినిమా అయినా కథకి అవసరం మేరకు ఖర్చు పెట్టా. సినిమా చూసిన మా నాన్నగారు బాగా తీశారని మెచ్చుకున్నారు. నా తర్వాతి సినిమా కోసం ప్రస్తుతం థ్రిల్లర్ జానర్‌లో ఓ కథ విన్నాను'' అన్నారు.